క్లుప్తంగా

వృషభ వాహనంపై ఊరేగిన మల్లేశ్వరుడు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి తిరునాల మహోత్సవంలో భాగంగా మంగళవారం మల్లేశ్వరస్వామి వృషభవాహనంపై ఊరేగించారు. స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం నేలబెలుం నుంచి మేళతాళాల మధ్య బందార్లపల్లెలోని వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కుతీర్చుకున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాస అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా అంజనేయస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : కార్తీమ మాసం చివరి రోజు అమవాస్యను పురష్కరించుకొని ఆంజనేయస్వామి, అమ్మవార్ల దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాతపేటలో కొలువైన ద్రోణాపూరి అభయవీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాల దీక్షాపరులు పూజలు చేశారు. సాయంత్రం పట్టణ పుర వీధుల గుండా ఆంజనేయస్వామి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

ఓటర్ల జాబితాపై అందిన దరఖాస్తులను పరిశీలించాలి

కోవెలకుంట్ల: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు సంబంధించి అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ఓటుహక్కులేని యువతీ, యువకులు అందజేసిన ఫారం-6, సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై వచ్చిన ఫారం- 7, ఫారం-8, ఫారం-8ఏకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను పరిశీలించి వివరాలను అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

14న షీప్ సొసైటీ ఎలక్షన్

అవుకు: మండల కేంద్రం అవుకులో 14వ తేదీన గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారిణి భారతీదేవి మంగళవారం తెలిపారు. అవుకు పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘానికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఉదయం 10 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించి, మధ్యాహ్నం నుంచి చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు జరుపుతామన్నారు.

ఎన్నిక ఏకగ్రీవం



చిన్న గంగనన్నకు ధృవీకణ పత్రం అందజేస్తున్న అధికారులు

సంజామల: మండల పరిధిలో ఆర్.లింగందిన్నె గ్రామంలో గోపాలకృష్ణ గొర్ల పెంపకం సహకార సంఘం అధ్యక్షుడు పదివికి ఎన్నిక ఏకగ్రీవం అయ్యినట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ శివనంద రెడ్డి, డాక్టర్ శ్రీకళ తెలిపారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికలలో చిన్న గంగన్న మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు చిన్న గంగన్నకు ధృవీకణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.లింగందిన్నె సచివాలయ కన్వీనర్ అన్నెం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం ప్రారంభం



మంచినీటి ట్యాంక్‌ను పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లె : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాన్ని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి మంగళవారం ప్రారంభించారు. పాఠశాలలో తాగునీటి వసతి కల్పించేందుకు సహకరించిన కావేటి వెంకటరాముడు, పూర్వ విద్యార్థి మధును ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం సుస్మీత గ్రామ ఉపసర్పంచ్ శివకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటయ్య క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- తిరుమల తిరుపతి తరహాలో తీర్చిదిద్దుతాం
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



ఆలయ ముఖ ద్వారం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని అన్నివిధాలుగా మరింత అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. రూ. 50 కోట్లతో క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో రూ.2.75 కోట్లు వెచ్చించి గ్రానైట్‌తో నిర్మించనున్న ఆలయ ముఖ ద్వారం పనులకు సంబంధించి మంగలవారం ఈఓ పాండు రంగారెడ్డి, అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో మద్దిలేటయ్య క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. క్షేత్రం అభివృద్ధి, జాతీయ రహదారి నిర్మాణం మూలంగా అనుకుని ఉన్న దుకాణదారుల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది రానీయమని మంత్రి బుగ్గన భరోసా ఇచ్చారు. దైవ కార్యమైన ఆలయ ముఖద్వార స్తంభాలు ఏర్పాటు చేయడంలో భాగంగా ఇప్పటికే సామాగ్రి సిద్ధం చేసుకున్న నేపథ్యంలో త్వరితగతిన ఆ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిచేసి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. స్థానికులు, దుకాణదారులకు లాభమే తప్ప నష్టం ఉండదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో రంగాపురం గ్రామస్తులు, సర్వేయర్ అన్నారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి తనయుడు



కాలనీ ప్రజలతో మాట్లాడుతున్ అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో అభివృద్ధి పనులో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వ పనులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలతో పాటు కొత్తగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని స్థానికులు అర్జున్ రెడ్డి, చలంరెడ్డి దృష్టికి తీసుకొవచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా నాయకులు గూని నాగరాజు, శేఖర్, మల్లికార్జున, సాయి, ఆనంద్, చంద్రుడు, సలీమ్, అమ్మని, మౌలాలి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి అరెస్టు, విడుదల

బనగానపల్లె: తనపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి టీడీపీ కార్యకర్తలతో కలిసి మంగళవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద ధర్నా చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అనుమతి లేకుండా ధర్నా చేయడంతో ప్రజలు ఇబ్బందికి గురయ్యారని, దీంతో అరెస్టు చేశామని సీఐ తిమ్మారెడ్డి తెలిపారు. జనార్ధన్‌రెడ్డితో మరో 30 మంది పై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడదల చేశామన్నారు. పట్టణంలో బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వ స్థలంలో అధికారుల అనుమతిలేకుండా షాధిఖానా నిర్మిస్తుండం చట్ట ప్రకారం నేరమన్నారు. ఈ నెల 9న సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్యెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఈవీఎంపై అవగాహన

డోన్ టౌన్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఈవీఎం మిషన్‌పై ఉపయోగించే విధానంపై తహసీల్దార్ విద్యాసాగర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు వేసే సందర్భంలో ఈవీఎంను వినియోగించాల్సి తీరును ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, వీఆర్వోలు మనోహర్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్టీసీ ముఖద్వారం

- నేడు ప్రారంభించనున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



డోన్ ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ముఖద్వారం

డోన్ : స్థానిక ఆర్టీటసీ బస్టాండ్‌లో రూ.80లక్షలతో చేపట్టిన ఆధునీకీకరణ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నూతనంగా నిర్మించిన ముఖ ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి. ఆర్‌టిసి బస్టాండ్ ప్రధాన ముఖద్వారంతో పాటు రాకపోకలకు సంబంధించి మరో రెండు ద్వారాలను బుధవారం మంత్రి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ ఆధునీకరించినట్లు డీఎం శశిభూషన్ తెలిపారు. ముఖద్వారం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఎం తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి బుగ్గన హాజరవుతారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహిళ మృతి

సంజామల: మండల పరిధిలోని పెరుసోముల గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స తీసుకుంటూ కోలుకోలేక మృతి చెందింది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సురేష్ భార్య సరళ (32) అక్టోబర్‌లో స్నానం చేయడానికి వేడి నీళ్ల తీసుకెళ్తుండగా మూర్ఛవ్యాధితో కిందపడి గాయాలకు గురైంది. శరీరం తీవ్రంగా కాలడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి వచ్చి డాక్టర్ల సూచన మేరకు మెడిసిన్ తీసుకుంటుంది. మంగళవారం కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డీలర్‌కు తీవ్రగాయాలు

బేతంచెర్ల: పట్టణం నుంచి డోన్‌కు వెళ్లే రహదారిలోని వే బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొన్న సంఘటనలో రేషన్ డీలర్ కు తీవ్రగాయాలయ్యాయి. దుర్గాపేట కాలనీకి చెందిన రేషన్ డీలర్ పాలకొల్లు శేఖర్ ద్విచక్రవాహనంపై పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టింది. స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

హైదరాబాదు బస్ సర్వీస్‌ను పునరుద్ధరించండి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల నుంచి హైదరాబాదుకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండల ప్రజలు, వ్యాపారవేత్తలు కోరుతున్నారు. గతంలో బనగానపల్లె డిపోకు చెందిన బస్సును కొలిమిగుండ్ల నుంచి హైదరాబాదుకు బస్సు సర్వీసు నడిపేవారన్నారు. మధ్యలో ఈ సర్వీసును రద్దు చేసి ప్రస్తుతం అవుకు నుంచి నడుపుతున్నారన్నారు. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు,కోచింగ్ తీసుకునే యువతతో పాటు పలు రకాల వ్యాపారులు తదితరులు తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. సర్వీసు లేక పోవడంతో తాడిపత్రి, బనగానపల్లెకు వెళ్లాల్సి వస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రేవనూరు ఎస్ఐ కల్పన సూచించారు. మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కోవెలకుంట్ల: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కత్తి సుబ్బయ్య అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోవడంతో మాదిగలకు అన్ని విధాలా అన్యాయం జరగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. వర్గీకరణ సాధనకు ఈ నెల 13, 14వ తేదీల్లో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- రూ.22 కోట్లతో నిర్మిస్తున్న వందపడకల ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధ్యాతనిస్తుందని, పల్లెల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా పెట్రోల్ బంకు సర్కిల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న బస్ స్టాప్, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌తోపాటు దివంగత సీఎం డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం పట్టణంలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. వైద్యశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులప గురించి సూపరింటెండ్ డాక్టర్ సుజాతను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ వందపడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఈ వైద్యశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. వైద్యశాలలో 24 గంటల విద్యుత్ సౌకర్యం ఉండేలా వైద్యశాల అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. ఇప్పటికే పట్టణంలో పోర్‌లైన్స్ సెంట్రల్ లైటింగ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తియిందని, ట్రాఫిక్ సమస్య తీరిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ ఖలీల్, ఆర్‌అండ్‌బీ ఏఈ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, కంబగిరి, సురేష్, సజ్జాద్, గౌండసుబ్బయ్య, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పోస్టాఫీస్ ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మద్దిలేటి, విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో కమలేశ్ చంద్ర కమిటీ రిపోర్టును అమలు చేయాలని, జీడీఎస్‌లకు ఎనిమిది గంటలు పని కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సురెన్స్, గ్రాట్యూటీ రూ. 5 లక్షల వరకు పెంచాలని కోరారు. అనంతరం సమ్మెకు సంబంధించిన డిక్లరేషన్స్‌ను సబ్ పోస్టుమాస్టర్ గురవయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సోమశేఖర్, జబ్బార్, సాయి, నరసింహుడు, వెంకటసుబ్బయ్య, శివయ్య, సుబ్రమణ్యం, నాయక్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీడీఎస్, పీజేసీఏ సంఘాల పిలుపు మేరకు మంగళవారం బనగానపల్లె తపాల కార్యాయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీడీఎస్ నాయకులు జయన్న, ఖాన్‌లు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జీడీఎస్ నాయకులు రాముడు,గుప్తా,వలిబాషా, నాగేశ్వరరెడ్డి, దాదాబాషా తదితరులు పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లల గుర్తింపునకు ఇంటింటి సర్వే

కొలిమిగుండ్ల: బడి మధ్యలో మానేసిన పిల్లల కోసం జీఈఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలు, వలంటీర్లు సర్వే మొదలు పెట్టారన్నారు. ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్ల లోపు పిల్లలు ఎవరూ లేనట్లయితే సర్టిఫికెట్ అందజేస్తున్నామన్నారు. మీర్జాపురానికి చెందిన బాలిక చందన కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ చదివేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషబాలు



పోటీల్లో పాల్గొన్న వృషభరాజములు

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె సమీపంలో వెలసిన నయనాలప్ప కేత్రంలో నిర్వహిస్తు న్న ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. నాలుగు నాలుగుపండ్ల విభాగంలో వివిధ జిల్లాల కు చెందిన 12 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నా యి.బండిఆత్మకూరు చాగంటి మెహన్ రెడ్డి, ప్యాపిలి నాగప్ప నాయిడు వృషభాలు 4,953 అడుగులులాగి ప్రథమ స్థానం రూ. 30వేలు,సంజామల మండలం నొస్సం హరినాథ్ రెడ్డి వృషభాలు 4,514 అడుగులాగి రెండవ స్థానం రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. బనగానపల్లె మండలం సారకట్లకు చెందిన సంగం రంగోపాల్ రెడ్డి ఎద్దులు 4,200 అడుగులులాగి మూడవ స్థానం రూ.15వేలు, యుగంధర్, ఉయ్యాలవాడ రాజరెడ్డి వృషభాలు 4,125 అడుగులులాగి నాలుగవ స్థానం రూ.10వేలు, ఆళ్లగడ్డ మండలం బత్తులూరు చెందిన గాసు అక్షిత్ రెడ్డి వృషభాలు 3,900 అడుగులులాగి ఐదవ స్థానం రూ.5వేలు వైవసం చేసుకున్నారు. గెలుపొందిన వృషభరాజముల యజమానులకు బహమతులు వైఎస్సార్ నాయకుల నాగిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,శివారెడ్డి, వెంకట్రక్రిష్ణ రెడ్డి, సంజీవరెడ్డి అందజేశారు.

ముగిసిన రాతిదూలం లాగుడు పోటీలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పసుపల గ్రామ సమీపంలోని వెలసిన శ్రీగుండం మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా నిర్వహించిన అంతర్‌రాష్ట్ర రాతిదూలం లాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మొత్తం 32 జతల వృషభాలు పోటీపడ్డాయి. మొదటి స్థానంలో ప్రకాశం జిల్లా నాగుల ఉప్పలపాడుకు చెందిన పి శేషాద్రి, గుంటూరు జిల్లా తోటపాలం గ్రామానికి చెందిన శ్రీరాములమ్మ వృషభాలు నిలిచాయి. రెండు, మూడు స్థానాలను గుంటూరు జిల్లా కొండబాలవారి పాలెంకు చెందిన జీపీ చౌదరి, గూడవల్లి లక్ష్మీదీక్షిత్ చౌదరి వృషభాలు కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా నాలుగు నుంచి పండెండు స్థానం వరకు నిలిచిన వృషభాలల యజమాన్యాలకు బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో రూ. 60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు రూ.15వేలు, రూ.10వేలు రూ.9వేలు, రూ.8వేలు రూ.7వేలు, రూ.6వేలు, 5వేలు చొప్పున అవుకు, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ రాజేశ్వరప్ప, సర్పంచ్ మోహన్ బాబు, గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు.

పేదల అభ్యున్నతి ప్రభుత్వాల లక్ష్యం



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

కోవెలకుంట్ల: పేదల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా, సర్పంచ్ లోకేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కంపమల్లలో వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలును స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక, ఏఓ నిరంజన్, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ గీతాలక్ష్మి, వైకేపీ ఏపీఎం గురుస్వామి తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సోమశేఖర్

బేతంచెర్ల: విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రీడ్ జూనియర్ కళాశాల ఆవరణంలో డోన్ డివిజన్ స్థాయి హెచ్‌ఎంలకు క్లస్టర్ సమావేశం నిర్వహించారు. వివిధ విద్యాంశాలపై ఎంఈఓ సోమశేఖర్ అవగాహన కల్పించారు. పాఠశాలలో రికార్డుల నమోదు, పాఠశాలకు వచ్చే నిధుల వినియోగం, ఖర్చులు, పాఠ్యంశాలు ఏమేరకు పూర్త అయ్యాయి, పరిసరాల శుభ్రత, మధ్యాహ్న భోజనం తనిఖీపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్‌ఎం లకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజయ్య, వెంకటరామిరెడ్డి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మీరాపురం గ్రామంలో సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేస్తున్న దృశ్యం

డోన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక 12వ సచివాలయం పరిధిలోని 20, 21వ వార్డుల్లో కౌన్సిలర్లు బోయ కళావతి, సాధిక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి చైర్మన్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, సచివాలయ కన్వీనర్ అంగడి పెద్దయ్య తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

బనగానపల్లె : పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మీరాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగేశ్వరమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాంటే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం సంక్షేమ పథకాల ప్లెక్సీ, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తదనంతరం ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బండిజగదీశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి మల్లేశ్వర్‌రెడ్డి, వడ్డెగిడ్డయ్య,ఎంఎల్‌ఓ మధుసుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొర్రా మల్లికార్జునరెడ్డి

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్యాపిలి: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో సర్పంచ్ రంగస్వామి అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మాట్లాడారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దయ్య, రామయ్య, ధనుంజయ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కోవెలకుంట్ల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా నాయకుడు శివరాం మాట్లాడుతూ 2017 అరియర్స్ అందరికి ఒకేసారి చెల్లించాలని, 1/2019 సర్క్యులర్ వెంటనే అమలు చేయాలని, అర్హత కలిగిన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ఆచారి, ఆదాం, పుల్లారెడ్డి, నాగశేషుడు, రాణి, మహాలక్ష్మి, వన్నూరు, చిన్నన్న, గుర్రప్ప పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఎన్‌ఎంయూ డిపో సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులు బనగానపల్లె ఆర్టీసీ డిపో ఎదుట ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు జమ్ములయ్య, లక్ష్మన్న వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికపై హర్షం

డోన్ టౌన్ : యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్లో రాష్ట్ర సహాధ్యక్షుడుగా సురేష్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులుగా వెంకట సుబ్బారెడ్డి రెండవసారి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఏలూరులో జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్న నేపథ్యంలో మంగళవారం డోన్ యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు అధ్యక్షతన సమావేశంలో సురేష్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, లక్ష్మీకాంతరెడ్డి, సంజీవరెడ్డి, సంజీవరాయుడు, సుభాన్, బాల రంగారెడ్డి, లక్ష్మీనాయక్, భాస్కర్‌రెడ్డి, సుజాత, లీలావతమ్మ, శంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.